క్లుప్తంగా

ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలి



నారాయణపురం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఎస్‌ఐ కృష్ణమూర్తి కోరారు. ఆదివారం మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామంలో రాత్రి బస చేశారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. పాత కక్షలను మనసులో పెట్టుకుని కక్ష సాధింపులకు పాల్పడరాదని సూచించారు. కక్షలతో జీవితాలు నాశనం చేసుకోవడం తప్పా, ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. అసాంఘిక కార్యక్రమలకు పాల్పడినా, అక్రమంగా మద్యం తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



మహానందిలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో మాసశివ రాత్రి సందర్భంగా చండీహోమం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆర్జిత సేవల్లో భాగంగా చండీహోమం పూజలను చేయించుకున్నారు. స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

ఎగిసిన మంటలు

మద్దికెర: స్థానిక కొత్తపల్లి రోడ్డులోని పాత సినిమా టాకీస్ వద్ద ఆదివారం ఆకతాయిలు కంపచెట్లకు నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. సమీపంలోనే పశుగ్రాసం వాములు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన యువకులు నీటిని చల్లి మంటలను ఆర్పేయడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూలవిరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేవారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.



పూజలందుకున్న మాళ మల్లేశ్వరస్వామి

ఉచ్చులో ఇరుక్కున మహిళ కాలు

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల సమీపంలో అడవి జంతువులు రాకుండా ఏర్పాటు చేసి కత్తెర ఉచ్చులో ఓ మహిళ కాలు ఇరుక్కుంది. కట్టెల కోసం వెళుతున్న ఓ మహిళ పొలంలో ఏర్పాటు చేసిన ఉచ్చును గమనించక కాలుపెట్టింది. వెంటనే కాలు పట్టేయడంతో కేకలు వేసింది. గమనించిన స్థానికులు వచ్చి ఉచ్చును తొలగించడంతో మహిళ ప్రమాదం నుంచి బయటపడింది.

ఉత్తమ జీవనానికి దిక్సూచి భగవద్గీత



సందేశం ఇస్తున్న ఇస్కాన్ ప్రవచనకారులు వైష్ణోకృప చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భగవద్గీత దిక్సూచిలా నిలుస్తుందని కర్నూలు ఇస్కాన్ ప్రవచనకర్త వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్రామాయి, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'పల్లె'విస్తోన్న వైద్యం

- పల్లెల్లో వైద్య విప్లవం
- ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లోనే వైద్య సేవలు
- ఉచితంగా పరీక్షలు
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న జనం



నూతనంగా వచ్చిన 104 వాహనంతో పెద్దకడబూరు వైద్య బృందం (ఫైల్)

మంత్రాలయం: చిన్న జబ్బు చేసినా పట్టణాలకు పరుగులు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కష్ట ప్రయాణాలు. వైద్యం కోసం జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన దౌర్భాగ్యం. ఇది ఒకప్పటి పల్లె వైద్యం తీరు. నేడు పెను మార్పులు వచ్చాయి. ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి. ఉన్న ఊరిలోనే కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, 108, 104, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సెంటర్లలోనే వైద్య సేవలు అందుతున్నాయి. పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు పేదోడి చెంతకు చేరాయి. వైద్య విప్లవంతో పల్లెవాసుల మోముల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

నియోజకవర్గంలో మొత్తం ఐదు 104 వాహనాల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనత, బీపీ, క్షయ, మధుమేహం, చిన్నారులు, శరీర నొప్పులు, మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులన్నింటికీ వైద్య సేవలు అందజేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మంచాన పడ్డ వృద్ధులు, ఇతర వ్యాధిగ్రస్తులకు ఇళ్ల వద్దే పరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నారు.

కొత్తగా మూడు పీహెచ్‌సీలు

నియోజకవర్గంలో 5 పీహెచ్‌సీల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. కోసిగిలో 01, కౌతాళంలో 02, మంత్రాలయంలో 01, పెద్దకడబూరులో 01 పీహెచ్‌సీ ఉంది. జనాభా ప్రాతిపదికన నూతనంగా మంత్రాలయం మండలం కాచాపురం, పెద్దకడబూరు మండలం హెచ్.మరవణి, కోసిగి మండలం కందుకూరులో నూతనంగా పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి వైద్య సేవలను మరింత విస్తృతం చేశారు.

పెరిగిన అంబులెన్స్ సేవలు

నియోజకవర్గంలో గతంలో కేవలం రెండు 108 వాహనాల ద్వారా సేవలు అందిస్తూ వచ్చారు. ప్రజా అవసరాల దృష్ట్యా కొత్తగా పెద్దకడబూరు, కోసిగి పీహెచ్‌సీ పరిధిలో రెండు 108 వాహనాలు మంజూరు చేశారు. అలాగే ఐదు 104 వాహనాలు, మరో ఐదు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఈ వాహనాలు అందుబాటులో లేక క్షతగ్రాతులు, గర్భిణులు, అత్యవసర సమయాల్లో నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

మంత్రాలయం నియోజకవర్గంలో వైద్య సదుపాయాలు

మొత్తం పంచాయతీలు :	94
సచివాలయాలు :	80
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు :	08
వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు :	73
హెల్త్ క్లీనిక్‌లు నిర్మాణ వ్యయం :	9.99 కోట్లు
వైద్యులు :	13 మంది
కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు :	04
హెల్త్ సూపర్‌వైజర్లు :	10
ల్యాబ్ టెక్నీషియన్స్ :	07
ఫార్మసీ సిబ్బంది :	07
స్టాఫ్ నర్సులు :	16
ఏఎన్‌ఎంలు :	64
ఎంఎల్‌హెచ్‌పీలు :	71
ఆశావర్కర్లు :	248



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు తాహెర



ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ గోవిందమ్మ (ఫైల్)



హెల్త్ క్లీనిక్‌లో చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యాధికారిణి

నూతన ఉత్తేజం

గతంలో హెల్త్ సబ్ సెంటర్లను బాడుగ ఇళ్లలో నడిపేవారు. ఏఎన్‌ఎంలకు వసతుల్లేక చెట్ల కింద సేవలు అందించిన దాఖలాలు కోకొల్లలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే పల్లెల్లో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను నెలకొల్పింది. వైద్య సిబ్బందిని పెంచి వైద్య సేవలను మెరుగుపరిచింది. నియోజకవర్గంలో మొత్తం 71 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను నెలకొల్పింది. అందులో రూ.9.99 కోట్లు వెచ్చించి ఆయా పల్లెల్లో నూతన క్లీనిక్ సెంటర్లను నిర్మించింది. దీంతో పల్లెవాసులకు 12 గంటలపాటు వైద్యం అందుతోంది.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం



కోసిగిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి

కోసిగి: రాష్ట్రంలో పేదలు సుభిక్షంగా ఉండాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోసిగి మండలంలోని నాగన్న గేరి, చింతలగేని వీధి, దున్నిగేని వీధి, కడపాళెం, ఎస్సీ కాలనీ, కింద మారెమ్మ దేవి కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఇలాంటి పరిపాలన కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగనన్నను గెలుపించుకోవాలన్నారు. టీడీపీ నాయకుల మాటలను నమ్మితే మోసపోతారన్నారు. చంద్రబాబునాయుడు 14 ఏళ్ల సీఎంగా ఉన్నా చెప్పుకోదగ్గ పథకం ఒక్కటి కూడా లేదన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, నాడుగేని నాగరాజు, జగదీష్‌స్వామి, మంగమ్మ, ముకుంద కృష్ణమూర్తి, కోసిగయ్య, బండ్ల గోవిందు, గానిగ వీరస్వామి, బుళ్లి నరసింహులు, ప్రతాప్ బసవరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

స్థాయిమరచి మాట్లాడితే చూస్తూ ఊరుకోం



వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి

పెద్దకడబూరు: తెలుగుదేశం పార్టీ నాయకులు స్థాయికి మించి మాట్లాడడం మంచిదికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..టీడీపీ నాయకులు తమ హయాంలో జరిగిన అభివృద్ధి.. లేదా భవిష్యత్తులో ఇది చేస్తాం అని చెప్పాలే కానీ స్థాయిని మరిచి రాంపురం రెడ్డి సోదరులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ఎవరో రాజకీమ బిక్ష పెట్టారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బాలనాగిరెడ్డి తండ్రి వై.భీంరెడ్డితో ఉన్న సినిమా పరిచయం ద్వారా సీనియర్ ఎన్టీఆర్ ఉరవకొండ టికెట్ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలిచారన్నారు. తమ గురించి మాట్లాడే ముందు వారి గురించి కూడా కొంచెం గుర్తు తెచ్చుకుని మాట్లాడితే మంచిదని చమత్కరించారు. ప్రజారాజ్యం తరుపున పోటీచేసి ఓడిపోయి కాంగ్రెస్‌లో చేరుతామని ఆ రోజు రాంపురం రెడ్డి సోదరుల దగ్గరకు వస్తే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేర్పించామన్నారు. అక్కడ ఇమడక తిరిగి తెలుగుదేశం పార్టీలోకి చేరారన్నారు. అక్కడన్నా సక్రమంగా ఉన్నారా అంటే అదీలేదని ఎద్దేవా చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. ఆ రోజు రాంపురం రెడ్డి సోదరులు జగనన్నతో బీసీ నాయకుడు పెద్దాయన(మాధవరం రామిరెడ్డి) అని చెప్పి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ కోసం కష్టపడ్డవారిని పక్కనపెట్టి మీ కుటుంబానికి కట్టబెట్టారని గుర్తుచేశారు. మీ కుటుంబానికి రాజకీయ బిక్ష పెట్టిందే రాంపురం రెడ్డి సోదరులని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే బాగుంటుందని హితవుపలికారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, జాము మూకయ్య పాల్గొన్నారు.

ఇది కాదా అభివృద్ధి పార్థా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. టీడీపీ నాయకులు, ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి పార్థసారథి కళ్లకు గంతలు కట్టుకోవడం వల్ల అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆదోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న హయాంలో మునుపెన్నడూ లేనివిధంగా ఆదోని నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.18 కోట్లతో ఆరేకల్‌లో రెసిడెన్షియల్ మైనార్టీ హైస్కూల్, రూ.250 కోట్లతో ఆస్పరి రోడ్డు నుంచి ఆలూరు రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రూ.2.40 కోట్లతో రాంజల చెరువు పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విడుదల చేసిన రూ.9 కోట్లతో మాతాశిశు సంరక్షణ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి, రూ.17 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో 200 పడకలు, రూ.7 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. రూ.1.60 కోట్లతో కస్తూర్బా ఒకేషనల్ ఇంటర్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి అయ్యాయన్నారు. మహావీర్ కాలనీలో రూ.80 లక్షలతో పార్కు, రాయనగర్‌లో రూ.కోటితో హెల్త్ కేర్ సెంటర్ నిర్మాణం ఇవన్నీ అభివృద్ధి పనులు కావా అంటూ బీజేపీ అభ్యర్థి పార్థసారథిని ప్రశ్నించారు. సుమారు రూ.100 కోట్లతో ప్రతి వార్డులో సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కూటమి అభ్యర్థులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తిస్థాయిలో సమాచారం తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఆయనతో పాటు నాయకులు తాయన్న, ఈశ్వర్, లోకేష్, రామకృష్ణ, తాహేర్ తదితరులు ఉన్నారు.

9 నుంచి ఉగాది మహోత్సవాలు

మద్దికెర: మండల కేంద్రానికి 7 కి.మీ దూరంలో ఉన్న అనంతపురం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో 9వ తేదీ నుంచి ఉగాది మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వై.భద్రాజీ, ఏఈఓ మఠం మల్లికార్జున ఆదివారం తెలిపారు. 9న గ్రామోత్సవం, 10న రథోత్సవం, 11న లంకాదహనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 17న శ్రీరామనవమి పురస్కరించుకొని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.



నెట్టికంటి ఆంజనేయస్వామి

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



వీరశైవ సంఘం సమ్మేళనంలో పాల్గొన్న వీరశైవులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వీరశైవ కల్యాణ మండపంలో వీరశైవ సేవా సంఘం సమ్మేళన సభ జరిగింది. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై.రామయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వీరశైవ కార్పొరేషన్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వీరశైవ సంఘం పెద్దలు సుగూరప్ప, శరణప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులమతాల బేధం లేకుండా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. అనంతరం వీరశైవులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రుద్రభూమికి స్థలం కేటాయించాలని, వీరశైవులను ఓబీసీలో చేర్పించాలని, వీరశైవ మఠం, దేవస్థాన భూముల సంరక్షణ బాధ్యత చేపట్టాలని, రాజకీయంలో సముచితస్థానం కల్పించాలని కోరారు. అలాగే శ్రీశైలం దేవస్థానంలో వీరశైవులను పూజారులుగా నియమించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాము అధికారంలోకి వచ్చే వీరశైవుల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు కన్నె మల్లికార్జున, కన్నె మంజునాథ్, రాజశేఖర్, కడవలి ఈరన్న, హెగ్గటి మహాదేవ్, చంద్రశేఖరస్వామి, సులిగి రాజు, లడ్డు సురేష్, జంగమ సంఘం నాయకుడు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం

పట్టణ శివారులోని పద్మశాలి నగర్‌లో ఏర్పాటు చేసిన పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బి.వై.రామయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, నాయకుడు చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడారు. తమకు అండగా నిలవాలని కోరారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముస్లింలు

కౌతాళం: రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు జైభీమ్ నాయకులు స్థానిక ఖాదర్‌లింగస్వామి దర్గాలోని లంగర్‌ఖానలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జైభీమ్ వ్యవస్థాపకుడు అవతారం, సర్పంచ్ పాల్‌దినకర్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించాలని కోరారు. జైభీమ్ నాయకులకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కామవరం సర్పంచ్ వసంత, అయ్యప్ప, తిమోతీ, నాయకులు వీరేష్, బాపురం జైపాల్ పాల్గొన్నారు.



ముస్లింలకు భోజనాలు వడ్డిస్తున్న జైభీమ్ నాయకులు

జగనన్నతోనే సంక్షేమ పాలన



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, నాయకులు

ఆదోని టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసే ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక, చేయూత, ఆసరా, కల్యాణమస్తు, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ లా నేస్తం, నేతన్న నేస్తంతో పాటు వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి పేదోడికి అందించిన ఘనత జగనన్నదేనని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆదోని నియోజకవర్గ ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బి.వై.రామయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, దేవా, తాయన్న, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా

- మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు సవాల్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి భూకబ్జాలకు పాల్పడినట్లు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి పార్థసారథి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, భూకబ్జాలకు పాల్పడినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు సవాల్ విసిరారు. లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఆదివారం స్థానిక ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోనిలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అలాంటి వ్యక్తి 15 ఏళ్లుగా ఆదోని వాసులకు సేవలందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తూ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే తనకు ఓట్లు పడతాయనే భ్రమలో కూటమి అభ్యర్థి ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆయన ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆదోని అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పట్టణంలో వాడవాడలా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, కల్వర్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తుంగభద్ర జలాశయంలో ప్రవహిస్తున్న రా వాటర్‌ను బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు, రాంజల నల్ల చెరువులో పూర్తిస్థాయిలో నింపుతున్నట్లు చెప్పారు. ఆదోనికి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసకున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు ఫయాజ్, రాజేశ్వరరెడ్డి, భాస్కర్ ఉన్నారు.

ఒక్కో పనికి.. ఒక్కో యాప్

- ఎన్నికల ప్రక్రియలో భాగంగా యాప్‌లు
- ఓటర్లకు సమస్త సమాచారం

ఆదోని సెంట్రల్: ప్రజలను భాగస్వాములను చేస్తూ రాజకీయ పార్టీలు, ఓటర్లకు సమస్త సమాచారం అందించే విధంగా యాప్‌లను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరూ గూగుల్, ప్లే స్టోర్ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో ఓటర్లకు సమస్త సమాచారం అందించడంతో పాటు సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించే విధంగా ఎన్నికల సంఘం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

కీలకం కేవైసీ యాప్

పోటీలో ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థుల సమగ్ర సమాచారం ఈ యాప్‌లో ఉంటుంది. నియోజకవర్గాల వారీగా పోటీ చేసే అభ్యర్థుల వివరాలు అంటే వారి విద్యార్హత, వ్యక్తిగత సమాచారం, కేసులు, అభ్యర్థులపై ఉన్న ఆరోపణలు వంటివి ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

సువిధ యాప్

రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నా, మైక్, సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, వాహనాల వినియోగం, ఫ్లెక్సీలు వంటివి ఏర్పాటు చేయాలన్నా ఈ యాప్ ద్వారా అనుమతి పొందవచ్చు. సుమారు 26 అంశాలకు సంబంధించి సువిధ యాప్ ద్వారానే ఎన్నికల సంఘం అనుమతినిస్తుంది. ప్రచారానికి 48 గంటలకు ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఓట్ ఫ్రమ్ హోమ్ యాప్

దివ్యాంగులు, 85 ఎళ్ల పైబడిన వారి కోసం ఓట్ ఫ్రమ్ హోమ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. పోలింగ్ కేంద్రాల సమాచారం అందుబాటులో ఉండే ఈ యాప్‌లో దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు వినియోగంతో పాటు ఫిర్యాదులు కూడా చేయడానికి అవకాశం ఉంది.

సీ–విజిల్ యాప్‌తో నిఘా

సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతో పాటు ఉల్లంఘించే వారిపై నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు ఫిర్యాదు చేయవచ్చు. ఫొటోలు, వీడియోలు ఇతర సమాచారాన్ని ఈ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు పంపవచ్చు. సీ-విజిల్ యాప్‌కు అందే ప్రతి ఫిర్యాదును 100 నిమిషాల్లో ఎన్నికల సంఘం పరిష్కరిస్తుంది.

ఓటర్లకు హెల్ప్‌లైన్ యాప్

కొత్త ఓటు నమోదుతో పాటు ఓటు సవరణకు దరఖాస్తును ఈ యాప్‌లో సమర్పించవచ్చు. ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు ఓటర్ల సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఎన్నికల వేళలో తమ తోటి ఓటర్లకు సహాయపడే విధంగా ఈ యాప్‌ను ఎన్నికల కమిషన్ రూపొందించింది.